
# 14. Voters Day Awareness



## ఉపాధి సమస్యలు అనేకం

ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడిన తర్వాత కొందరు సేవాతత్పరుల కారణంగానే కొంతమేర అభివృద్ధి సాధ్యమైంది. విద్యా, వైద్యం అందుబాటులోకి వచ్చినా ఇంకా కిందిస్థాయికి చేరలేదు. జిల్లాలో అక్షరాస్యత 70శాతానికి లోపే ఉంది. బాలికల్లో అది ఇంకా తక్కువ. వెనుకబడిన ప్రాంతాలు అదే గుర్తింపుతోనే కొనసాగుతున్నాయి. సాంకేతికరంగం అభివృద్ధి చెందుతున్న సమయంలో ఉద్యోగాలు, ఉపాధికి లోటు కన్పిస్తుంది. పట్టాలు చేతపట్టుకుని ఉద్యోగాలు కోసం తిరుగుతున్న నిరుద్యోగులు ఏటా పెరుగుతున్నారు. బాధ్యత కలిగిన నేతలు పాలనలోకి రావాలంటే పౌరులు కూడా బాధ్యతగా ఓటేయాలి. - కె.సుస్మిత, బీటెక్



## మా ఓటు.. మా బాధ్యత

కచ్చితంగా ఓటు వినియోగిస్తామంటున్న యువత

## చైతన్యంతోనే గ్రామాల అభివృద్ధి



వ్యవసాయంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందడం లేదు. నిరుద్యోగ సమస్య ఏటా పెరుగుతూనే ఉంది. ఉత్పాదకరంగం వెనుకబాటు కారణంగా కొత్తగా ఉద్యోగిత సాధ్యం కావడం లేదు. ఇవన్నీ తీరని వ్యథలు. వీటి పరిష్కారానికి యువత చైతన్యవంతులై ఓటు అనే వజ్రాయుధాన్ని ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. గ్రామీణ ప్రాంతాలు అనేక సమస్యలతో ఉన్నాయి. ఇవి పరిష్కారం కావాలంటే సమర్థులను చట్టసభలకు పంపాలి. ఎవరేం చేస్తారు అనే నిరాశను వీడి ప్రతిఒక్కరూ ఓటు వేయాలి. ఓటు వేయడం బాధ్యత. ఆ ప్రక్రియ సక్రమంగా నిర్వహిస్తాం.

**- ఎన్.శివశంకర్, బీటెక్**

## ప్రలోభాలకు దూరం



ఓటు ఐదేళ్లకు ఒకసారి ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఉన్న ఒక్క అవకాశం. ఇపుడు ఓటు వేయకుంటే అసమర్థుడు ఎన్నిక కావచ్చు. అపుడు సమస్యలు పెరగవచ్చు. ఆ ప్రమాదం రాకుండా సరైన వ్యక్తిని ఎంచుకునేందుకు ఉన్న అవకాశం అందరూ వినియోగించుకోవాలి. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలి. నోటుకు ఓటును అమ్ముకోకూడదు. ఈ సారి ఓటు వినియోగిస్తాం. అభివృద్ధికి దోహదపడతాం.

**- ఆర్.ఫణీంద్ర, బీటెక్**